అభివృద్ధి పనుల పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లో రూ.2.3 కోట్లతో జరుగుతున్న కానాజిగూడ కల్వర్టు పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కానాజీగూడ కల్వర్టు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్పొరేటర్లు సబితా అనిల్‌కిషోర్‌గౌడ్, శాంతిశ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు పరుశురాంరెడ్డి, అంజయ్య, జేఏసీ వెంకన్న, నరేందర్‌రెడ్డి, రాముయాదవ్, అమీనుద్దీన్, రమేష్, పరమేష్, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, మోసిన్, శ్రీనివాస్, శరణగిరి, యాదగిరిగౌడ్, శివగౌడ్, సాయిగౌడ్, సుమన్‌గౌడ్, వాసు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నాటక ప్రదర్శన



మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్‌లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో వినాయకచవితి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించారు. విద్యార్థులు వినాయక కథను నాటకంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. స్కూల్ చైర్మన్ నవనీతరావు, డైరెక్టర్ నవీన్‌కుమార్, కమలా మనోహర్‌రావు, కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని తదితరులున్నారు.

వైకుంఠధామాలకు నిధులు మంజూరు చేయాలి

బోడుప్పల్: హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను మంగళవారం బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కలిసి వైకుంఠధామాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లైబ్రరీ, మినీ ఫంక్షన్‌హాల్స్, రెండు వైకుంఠధామాలు, సామాజిక వసతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు అజయ్‌యాదవ్ వివరించారు. బోడుప్పల్ పరిధిలో రోడ్ల నిర్మాణం, విస్తరణ, ఇతర సదుపాయాలకు నిధులు కేటాయించినందుకు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సీసా వెంకటేష్‌గౌడ్, భూక్యా సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి పోటీల్లో చిన్నారుల ప్రతిభ

బోడుప్పల్: జాతీయస్థాయిలో జరిగిన సృజనోత్సవ 2025 కూచిపూడి నృత్య పోటీల్లో చెంగిచర్లకు చెందిన చిన్నారులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు శారద కళా నిలయం నాట్య గురువు నాయిని సుప్రజ అన్నారు. మంగళవారం చెంగిచర్లలోని జయశ్రీకాలనీలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. కూచిపూడి నృత్య పోటీల్లో అస్మిత, దీపాంక్ష, శ్రీక్షిత, సాయి అన్వి, శ్రీనిక, మేఘన, సహస్రశ్రీ ప్రథమ, ద్వితీయ స్థానం సాధించినట్లు వివరించారు.





మట్టి గణపతులు పర్యావరణానికి మేలు

నందడిగా మార్కెట్, పూలు, పూజా సామగ్రి విక్రయాలు
మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన ప్రజా ప్రతినిధులు

మల్లాపూర్: నాచారంలో ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ హాజరై గణపతి విగ్రహాలను అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, రాంచందర్, శ్రీను, సాయిదేవ్, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: ఈ వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బీజేపీ మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్‌లో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను స్థానిక కార్పొరేటర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేశాయి.

కుషాయిగూడ: కాప్రా సర్కిల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సర్కిల్ వ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. హెచ్‌బీకాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేసీజీఎఫ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎరుకల రామకృష్ణ, యూ ట్యూబర్స్ ఫణిరాజు, కవిత ముఖ్య అతిథులుగా హాజరై మట్టి విగ్రహాలను అందజేశారు.



హెచ్‌బీకాలనీలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో..



కామాక్షిపురంలో కార్పొరేటర్ బందారు శ్రీవాణి

మట్టి గణపతులను పూజించాలి : మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలంతా మట్టితో చేసిన గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణ కాపాడాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, ఏఈ వినీల్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చేతన



మల్కాజిగిరి చౌరస్తాలో పూజా సామగ్రి అమ్మకాలు



మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి

పర్యావరణహితంగా పండుగ నిర్వహించుకోవాలి

మల్లాపూర్: వినాయకచవితి పర్వాదినాన్ని పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం కలిగించే చర్యలో భాగంగా మట్టి విగ్రహాలను నెలకొల్పి, కాలుష్య నియంత్రణకు పాటుపడాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నాచారంలో..

మహంకాళీ సహిత మహాకాలేశ్వరస్వామి దేవాలయం వద్ద ఎస్ఎస్ఎస్ యువసేన, మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.



'అకడమిక్ హైట్స్'లో ఇన్వెస్టిచర్ వేడుకలు

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ శభోదయ కాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాడ్జిలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, క్రమశిక్షణకు బాధ్యత యువతకు ఈ ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వివిధ విభాగాలకు కెప్టెన్, వైస్ కెప్టెన్, క్రీడలు, కల్చరల్, డిసిప్లిన్ కోసం విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్యాడ్జిలను ప్రదానం చేసిన కౌశిక్‌రెడ్డి

పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

బోడుప్పల్: పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు మొదటి ప్రాధాన్యతతో పాటు వారి శ్రేయస్సుకు కృషిచేస్తున్నట్లు బోడుప్పల్ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిణి పంకజ అన్నారు. మంగళవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, గ్లోవ్స్, సబ్బులు, బట్టలు, కొబ్బరినూనె, రెండు జతల బట్టలు, సేఫ్టీ షూ, చెప్పులు, ఇతర సామగ్రిని ఆమె పంపిణీ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మణికంఠ కాలనీలో దాతల సాయంతో మట్టి వినాయకులను ఉచితంగా అందజేశారు. కమిషనర్ శైలజ, అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మౌలాలి: డివిజన్‌లోని సూర్యనగర్‌కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ జలమండలి జీఎం సునీల్‌ను కోరారు. మంగళవారం ఆమె స్థానికులతో కలిసి జీఎంను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నిమజ్జనం తర్వాత వెంటనే డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని జీఎం హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు సాయిబాబా, రామకృష్ణ, కరుణశ్రీ, కృష్ణ తదితరులున్నారు.



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ మనుచౌదరి

అల్వాల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబొరేటరీ, లేబర్ గది, మందుల నిల్వలు, ఆస్పత్రికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి, డాక్టర్లు శ్రీకాంత్, శైలజ, డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అల్వాల్: అల్వాల్‌కు చెందిన భగీరథ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.40,500 వేల చెక్కు, వెంకటాపురం డివిజన్‌కు చెందిన తిరుపతికి రూ.60 వేల చెక్కులను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, జేఏసీ వెంకన్న, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి క్రీడా పోటీలు

కాప్రా: సైనిక్‌పురి సమీపంలోని ఇండోస్‌లో నిర్వహించిన సీబీఎస్‌ఈ క్లస్టర్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. 4 రోజుల పాటు ఏపీ, తెలంగాణకు చెందిన 107 స్కూళ్ల నుంచి 1800 మంది విద్యార్థులు 151 జట్లుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14 విభాగంలో కోకాపేట్‌కు చెందిన రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, బాచుపల్లికి చెందిన సిల్వర్‌ఓక్స్ స్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు. అండర్–17 విభాగంలో ఖాజాగూడకు చెందిన డీపీఎస్ స్కూల్ ప్రథమస్థానం, బాచుపల్లికి చెందిన గాంజెస్ వ్యాలీ స్కూల్ ద్వితీయస్థానం దక్కించుకుంది. అండర్–19 విభాగంలో బాచుపల్లికి చెందిన గాడియమ్ స్కూల్ ప్రథమస్థానం కైవసం చేసుకోగా.. ఉప్పల్‌కు చెందిన లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.



భర్త ఇంటిపై భార్య కుటుంబసభ్యుల దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

ఉప్పల్: భర్త ఇంటిపై భార్య తరపు బంధువులు దాడికి పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. 2024లో రామంతాపూర్ ప్రగతినగర్‌కు చెందిన రిత్విక్‌రెడ్డితో అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతానికి చెందిన ఆకాంక్షరెడ్డికి వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మాట్లాడటానికి వస్తున్నామంటూ.. భార్య తండ్రి రొక్కమ్ కృష్ణారెడ్డి ఇతర బంధువులతో కలిసి ఈనెల 20న రామంతాపూర్‌లోని భర్త ఇంటికి వచ్చారు. మాటా మాటా పెరిగి దాడులు చేసుకునేంతవరకు దారి తీసింది. దీంతో ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. తనతో పాటు కుటుంబసభ్యులపై దాడి చేయడమే కాకుండా తనను భయబ్రాంతులకు గురిచేసి బలవంతంగా చెక్‌ల మీద సంతకాలు చేయించుకున్నారని, ఆరోపిస్తూ.. బాధితులు రిత్విక్‌రెడ్డి తండ్రి రవీందర్‌రెడ్డి 23న ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భార్య తండ్రి, ఓ బీజేపీ నేతతో పాటు మరి కొంతమందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నకిలీ మద్యం లేబుళ్ల తయారీ గుట్టు రట్టు

కుషాయిగూడ: కుషాయిగూడ కేంద్రంగా తయారు చేస్తున్న నకిలీ మద్యం లేబుళ్ల తయారీ గుట్టు రట్టయింది. కుషాయిగూడ డీమార్ట్ సమీపంలోని ఓ ఇంట్లో నకిలీ లేబుళ్లు తయారు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు ఘట్‌కేసర్ ఎక్సైజ్ అధికారులతో కలిసి కుషాయిగూడలోని నకిలీ లేబుళ్లు తయారు చేస్తున్న ఇంట్లో సోదాలు నిర్వహించారు. రాజేష్‌గౌడ్ అనే వ్యక్తి తన ఇంటి కింది పోర్షన్‌లో ప్రింటింగ్ ప్రెస్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతర ఆర్డర్లతో పాటు నకిలీ మద్యం లేబుళ్లను తయారు చేస్తూ.. అక్రమ సంపాదన చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడితో పాటు అతడి బావమరిది, మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నకిలీ మద్యం లేబుళ్లతో పాటుగా ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీనిపై కుషాయిగూడ, చర్లపల్లి పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

కాప్రా: కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, సెక్టార్ ఎస్సై సుధాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కుషాయిగూడ: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్, లోకమాత కాలనీలో మంగళవారం అసోసియేషన్ నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానన్నారు. బీఆర్‌ఎస్ నేతలు నేమూరి మహేష్‌గౌడ్, కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



పరిశ్రమల్లో కార్మికులకు భద్రతను పెంచాలి

రామంతాపూర్: గత రెండేళ్లలో తెలంగాణలోని వివిధ పారిశ్రామికసంస్థల్లో పనిచేసే 350 మంది కార్మికులు మృతి చెందడమే కాకుండా పలువురికి తీవ్ర గాయాలై, వికలాంగులుగా మారారని, మానవహక్కుల వేదిక పౌర సమాజం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రామంతాపూర్‌లోని మౌంట్‌ఫోర్టు సోషల్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం ఉమెన్స్ రైట్స్ ఫోరం సైంటిస్ట్ ఫర్ పీపుల్ తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఓ సమావేశంలో పలువురు మానవ హక్కుల నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. పాషా మైలారంలోని శిగాచి ఇండస్ట్రీస్‌లో జూన్ 30న జరిగిన పేలుడులో 50 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. పరిశ్రమలో పనిచేసే కార్మికులకు తగినంత భద్రత యజమాన్యాలు కల్పిస్తున్నాయా.. !లేదా.. చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మౌంట్ ఫోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టెక్‌నాథ్, శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు, న్యాయవాది అఖిల్ సూర్య సాగర్, ధారా రవి, కన్నెగంటి డా.పీజీ.రావు, సాత్వికగుప్తాతో పాటు కార్మిక సంఘాలు ట్రేడ్ యూనియన్లు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

బోడుప్పల్: చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీ, రంగ రంగయ్య కాలనీలో హైమాస్ట్ లైట్లను బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు కాలనీలకు చీకటి సమస్య తొలగిపోయిందన్నారు. డివిజన్ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, గణేష్‌నాయక్, ఉమేష్‌చారి, శ్రీనివాస్, కట్ట జగన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వైన్స్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మల్లాపూర్: వైన్స్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ స్వర్ణవైన్స్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మద్యం సేవించడానికి వచ్చి, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి సంబంధీకులెవరైనా ఉంటే నాచారం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్

మల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాచారం పోలీసులు, ఎస్వోటీ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన త్రినాథ్‌నాయక్(30) లక్ష్మీధర్‌జానా(32) బతుకుదెరువు కోసం వచ్చి మల్లాపూర్ నాగలక్ష్మినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా గంజాయి విక్రయించి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. సోమవారం సాయంత్రం విశ్వసనీయం సమాచారం మేరకు నాగలక్ష్మినగర్ కాలనీలో విక్రయిస్తుండగా.. 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



